సాక్షి
ములుగు

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025

I



ఈవీ.. ఈజీ డ్రైవ్!
కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. - IIలో▸



ప్రాణదాత.. యుగంధర్ - IIలో▸
ఓ యువకుడు తాను చనిపోతూ ఆరుగురికి ప్రాణం పోశాడు. తన అవయవాలు దానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు.



వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(శుక్రవారం) 33, 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా కాశిందేవిపేట, సబ్ స్టేషన్ పరిధిలో సర్వాపూర్ ఫీడర్, లాలాయిగూడెం, జగ్గన్నగూడెం, కన్నాయిగూడెం, యాపలగడ్డ ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేతనాలు అందించాలని వినతి



ములుగు రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పార్ట్‌టైం టీచర్లకు వేతనాలు అందించాలని కోరుతూ డీసీఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏటూరునాగారంకు చెందిన పార్ట్ టైం టీచర్లు ఆయనకు వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు.

ఓడబలిజలకు జెడ్పీటీసీ టికెట్ ఇవ్వాలి



వాజేడు: ఓడబలిజలకు మండల జెడ్పీటీసీ టికెట్‌ను కేటాయించాలని ఓడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జున్‌రావు అన్నారు. మండల పరిధిలోని ధర్మవరంలో గురువారం ఓడ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం ఓడ బలిజకు చెందిన మెట్టిపల్లి విజయకు టికెట్ ఇస్తే గెలిసిందని గుర్తు చేశారు. మండలంలో ఓడ బలిజలు ఎక్కువగా ఉన్నందున్న అన్ని పార్టీలు ఓడ బలిజలకు సీట్లు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో స్వతంత్రులుగా పోటీలో నిలిపి గెలిపించుకుంటామని తెలిపారు.


లక్షపత్రి పూజలకు బుకింగ్ ప్రారంభం

కాళేశ్వరం: కార్తీక మాసం సందర్భంగా ఈనెల 21 నుంచి నవంబర్ 19 వరకు కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజలకు రూ.8వేలు చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ టికెట్లు తీసుకోవాలని ఈఓ ఎస్.మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక రోజు ఐదు పూజలు మాత్రమే చేయనున్నారు. పూర్తి వివరాలకు 90004 80931, 97046 39706 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

108 ఆకస్మిక తనిఖీ

టేకుమట్ల: మండలకేంద్రంలోని 108 అంబులెన్స్‌ను గురువారం జిల్లా అధికారి రాజునాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల స్టాక్‌తో పాటు, వాహన కండీషన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర సేవల కోసం మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు, అత్యవసర సేవల కోసం వచ్చే కాల్స్‌కు సకాలంలో స్పందించి అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ హరిప్రసాద్, పైలట్‌లు సదయ్య, షరిపొద్దీన్, రవీందర్ ఉన్నారు.

టీపీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లాకేంద్రంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై పతాకావిష్కరణ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం పాలకుల మెడలు వంచి విజయం సాధించినట్లు కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుల పార్వతి, లలిత, మినుగు నగేష్, ప్రభాకర్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఈ ఫొటోలోని యువతి నర్సింగ్ విద్యార్థిని అంజలి. వాజేడు మండల కేంద్రానికి చెందిన జాక మదనయ్య, రాజేశ్వరి దంపతుల కూతురు. ఖమ్మంలో నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి రాగా జ్వరం వచ్చింది. దీంతో స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో ఏటూరునాగారం తరలించారు. అక్కడా నయం కాకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సుమారు రూ.70 వేల వరకు ఖర్చు చేశారు. మరో రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అయినా బతుకుతుందని నమ్మకంగా చెప్పలేమని వైద్యులు తెలిపారు. దీంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా పరీక్షించిన వైద్యులు జ్వరంతో పాటు కామెర్లు ఉన్నాయని, కిడ్నీలు, లివర్ పై ప్రభావం పడిందని నిర్ధారించి చికిత్స చేస్తుండగానే పరిస్థితి విషమించి మంగళవారం మృత్యువాత పడింది. .

ఫోకస్ సాక్షి ఫోకస్

విజృంభిస్తున్న విషజ్వరాలు

జిల్లాలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు



ఓపీ సేవల కోసం బారులుదీరిన రోగులు

- రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి
- వారం రోజుల్లో 2,340 మందికి ఓపీ సేవలు
- నిర్ధారణ రిపోర్టుల ఆలస్యం
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ములుగు రూరల్: ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వందల సంఖ్యలో వస్తున్న రోగులకు వైద్యులు ఓపీ సేవలు అందిస్తున్నారు. ఓపీ చిట్టీలు పొందేందుకు కూడా రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జ్వర బాధితులను పరీక్షించిన వైద్యులు నిర్ధారణ పరీక్షలు రాసి రిపోర్టులు వచ్చాక కలవాలని సూచిస్తున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలకు ఒక రోజు సమయం పడుతుండడంతో రెండోరోజు ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. జ్వర పీడితులను అడ్మిట్ చేసుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన సీజనల్ వ్యాధుల అవగాహన సదస్సులు మొక్కుబడిగా సాగుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో జ్వరపీడితుల సంఖ్య భారీగా పెరుగుతోంది.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి..

జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో వారం రోజుల్లో ఔట్ పేషెంట్లు 2,340 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. ఇందులో అత్యధికంగా జ్వర పీడితులు 1,017 మందికి చికిత్స అందించారు. ఆస్పత్రిలో 295 మంది రోగులను అడ్మిట్ చేసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో రోజురోజుకూ ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఇందులో అత్యధికంగా వైరల్ ఫీవర్‌తోనే రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులకు సరిపడా బెడ్లు అందుబాటులో ఉన్నాయి.

రోగ నిర్ధారణ పరీక్షలు ఆలస్యం అవుతున్నాయి..



ములుగు ఏరియా ఆస్పత్రికి రెండు రోజు క్రితం జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. రెండు రోజులు ఐసీయూలో ఉచిత వైద్యం అందించారు. బుధవారం డాక్టర్ వైద్య పరీక్షలు చేయించాలని రాశారు. షాంపిల్ ఇచ్చిన ఇంకా రిపోర్టు రాలేదు. ల్యాబ్‌కు వెళ్లి అడిగితే ఇంకా రాలేదు అని చెబుతున్నారు. వైద్యులు రిపోర్టులు వచ్చాక నిర్ధారించి చెపుతామని అంటున్నారు. సకాలంలో రిపోర్టులు అందించాలి.

- జంగిడి ప్రకాశ్, గోవిందరావుపేట

జ్వరం తగ్గడం లేదు..



జ్వరం తగ్గకపోవడంతో ములుగు ఏరియా ఆస్పత్రిలో చేరాను. ఇంటి వద్ద జ్వరం రావడంతో ఆర్‌ఎంపీ దగ్గర మూడు రోజులు ఇన్‌జెక్షన్లు వేయించుకున్నా తగ్గలేదు. ఆస్పత్రిలో చేరి ఆరు రోజులు అవుతుంది. వైరల్ ఫీవర్ అంటున్నారు. పొద్దున, సాయంత్రం డాక్టర్ వచ్చి చూసి గ్లూకోజ్‌లు, సూదులు రాస్తున్నాడు.

- హర్షం సారయ్య, నారాయణపురం, వెంకటాపురం(ఎం) మండలం

దగ్గు, జ్వరంతో ఆస్పత్రికి తీసుకువచ్చా..



నా భర్తను నాలుగు రోజుల క్రితం దగ్గు, జ్వరంతో బాధపడుతుండగా ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చాను. ఇక్కడ అడ్మిట్ చేసుకొని వైద్యం చేశారు. జ్వరం తగ్గింది కాని దగ్గు ఇంకా తగ్గలేదు.

- బుర్రి లక్ష్మీ, నిజాంపల్లి, గోరికొత్తపల్లి మండలం

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..



ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆస్పత్రిలో 13 రకాల ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో మలేరియా, వైరల్ ఫీవర్‌తో రోగులు ఎక్కువగా వస్తున్నారు. జ్వర పీడితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు, అందుబాటులో ఉన్నాయి.

- చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ములుగు

సమాచార హక్కుచట్టంపై అవగాహన తప్పనిసరి

వీసీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ములుగు రూరల్: సమాచార హక్కు చట్టం -2005పై అధికారులు తప్పనిసరిగా పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్లతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ వెంకటేశ్, డిప్యూటీ కలెక్టర్ కుశీల్ వంశీ పాల్గొన్నారు. అనంతరం సమాచార హక్కుచట్టం వారోత్సవాల్లో భాగంగా జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రమాదం

డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

ములుగు: పొగాకు తాగిన వారితో పాటు పక్కన ఉండి పీల్చేవారికి అంతే ప్రమాదమని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత పొగాకు వాడకాన్ని విడిచిపెట్టేలా 60రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. పొగాకులోని నికోటిన్ పదార్థం దూమపానానికి బానిసలుగా మారుస్తుందని తెలిపారు. పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ పొగాకుకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్, చంద్రకాంత్, డీపీఎంఓ సాంబయ్య, సీహెచ్ఓ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

జేఏసీ చైర్మన్ పూనెం శ్రీనివాస్

ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజనులు వందశాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మేడారంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగానికి విరుద్ధంగా షెడ్యూల్డ్ తెగల హోదా అనుభవిస్తున్న బంజారాలను తొలగించే వరకు దీర్ఘకాలిక ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. 1976లో రాజ్యాంగానికి విరుద్ధంగా గుర్తించబడిన లంబాడీ తెగ విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ, రాజకీయ రంగాలలో అత్యధికంగా రిజర్వేషన్లు అనుభవిస్తుందని తెలిపారు. దీంతో ఆదిమ లక్షణాలున్న తొమ్మిది తెగలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమ్మక్క- సారలమ్మ జాతర అభివృద్ధి ముసుగులో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు విఘాతం కలిగించే విధంగా ప్రయత్నం చేస్తుందని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మక్క- సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ లోగోలో లంబాడీల భాషా పదాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 19న ఆదిలాబాద్‌లో అన్ని ఆదివాసీ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకెళ్తామని వివరించారు. ఈ సమావేశంలో జేఏసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ వట్టం ఉపేందర్, వైస్ చైర్మన్ రవి, జేఏసీ బాధ్యులు రామకృష్ణ, నరసింహమూర్తి, రాంచందర్, సాయిబాబు, రవి, సమ్మక్క ప్రధాన పూజారి సురేందర్, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

మంగపేట: మండల కేంద్రం, రాజుపేటలోని పలు కిరాణా షాపులు, హోటళ్లు, దాబాల్లో మహబూబాబాద్ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్, జిల్లా ఇన్‌చార్జ్ అధికారి ఒంటెల ధర్మేంద్ర ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనుమతులు, కంపెనీల పేర్లు లేకుండా కూల్‌డ్రింక్స్, నాసిరకమైన తినుబండారాల ఉత్పత్తులతో పాటు కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. షాపుల యజమానులు లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని భ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్స్ ఆమోదం పొందిన వస్తువులను మాత్రమే విక్రయించాలని ఆయా షాపుల యజమానులకు సూచించారు. వినియోగదారులు వస్తువులను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. అనుమానం ఉన్న వస్తువులపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా బీఐఎస్ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట శాంపిల్ అసిస్టెంట్ రాజేష్, సిబ్బంది ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- నీతి ఆయోగ్ అధికారి పొసుమి బసు
- బుర్రకాయల గూడెంలో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చిన్నారులతో మాట్లాడుతున్న పొసుమిబసు

గణపురం: గ్రామాలలో పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పొసుమిబసు సూచించారు. మండలంలోని బుర్రకాయల గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిశీలనకు వచ్చిన ఆమెకు చిన్నారులు పూలతో స్వాగతం చెప్పగా వారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పోషణలోపంతో బాధపడుతున్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 140 మంది చిన్నారులు పోషణ లోపంతో బాధపడుతున్నారని.. వారికి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన పోషక ఆహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న బాలామృతం, కిషోర బాలికలకు అందిస్తున్న పల్లి, మిల్లెట్ చిక్కీల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 8,550 మంది కిషోర బాలికలకు పల్లి, మిల్లెట్ చిక్కీలు అందిస్తున్నట్లు అధికారులు తెలపగా.. సంతృప్తి వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బాగుందని సిబ్బందిని అభినందించారు. అనంతరం పోషణ మాసంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులు ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలని క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేపించుకుంటూ వైద్యుల సలహాలతో సుఖ ప్రసవాలతో పాటు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, సీపీఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై అవగాహన కల్పించాలి

భూపాలపల్లి: పంట మార్పిడి విధానం ద్వారా అధిక దిగుబడి సాధనకు రైతులకు అవగాహన కల్పించాలని నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పొసుమి బసు సూచించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఆకాంక్షిత జిల్లాలో అభివృద్ధి సూచికలపై వైద్య, విద్య, మహిళా, శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ, పశు సంవర్ధక శాఖల అంశాలపై సమగ్ర సమీక్ష జరిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశంలో పాల్గొని వివిధ రంగాల్లో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా పొసమి బసు మాట్లాడుతూ.. వైద్య, విద్యా రంగాల్లో గుణాత్మక మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి

రేగొండ: ప్రజలకు సేవ చేయడం కోసం ఉన్నామనే దృక్పథంతో వైద్యులు పని చేయాలని నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పొసుమి బసు అన్నారు. గురువారం భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ఆస్పత్రి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

ఇప్పటికిక ఇంతే...!



జీఓ 9పై హైకోర్టు స్టే.. 'స్థానిక' ఎన్నికలకు బ్రేక్

- డిసెంబర్ మొదటివారం తర్వాతే... ఆశావహులు అప్పటివరకు ఆగాల్సిందే
- నోటిఫికేషన్ విడుదలైన రెండున్నర గంటలకు న్యాయస్థానం తీర్పు..
- ఉమ్మడి వరంగల్‌లో జెడ్పీటీసీకి 3, ఎంపీటీసీలకు 9 నామినేషన్లు

సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ విడుదల చేసిన జీఓ 9పై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు గురువారం స్టే ఇచ్చింది. ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్‌ల స్వీకరణ చేపట్టిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. హైకోర్టు తీర్పు తర్వాత ఆ మేరకే వ్యవహరిస్తామని ప్రకటించింది. దీంతో ఆరు వారాల పాటు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోనుండగా.. డిసెంబర్ మొదటి వారం తర్వాత ఈ మధ్యకాలంలో జరిగే పరిణామాలను బట్టి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 29న ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ మేరకు నవంబర్ మాసాంతానికి ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల్లో 'స్థానిక' ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అందరూ భావించారు. కానీ, హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అంతటా కలకలం...
రాజకీయ పార్టీల్లో దుమారం...

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్‌లో భాగంగా ఉమ్మడి వరంగల్‌లో మూడు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలతో పాటు వామపక్ష పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. సెప్టెంబర్ 29న షెడ్యూల్ విడుదల తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఆశావహుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించాయి. రెండు విడతల్లో పరిషత్, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలకు అనుగుణంగా అభ్యర్థులను ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. దసరా పండుగకు ముందే రిజర్వేషన్‌లు ప్రకటించడం.. ఎన్నికల షెడ్యూల్ వెల్లడి కావడంతో ఆశావహుల సందడి పల్లెల్లో జోరందుకుంది. ఎంపీటీసీ, సర్పంచ్ పదవులను ఆశించే వారు పండగ కావడంతో ఖర్చుకు సైతం వెనకాడలేదు. కాగా, ప్రధాన పార్టీలు గురువారం ఉదయం విడుదలైన నోటిఫికేషన్ తర్వాత దశల వారీగా 11వ తేదీ వరకు నామినేషన్‌లకు ప్లాన్ చేసుకున్నా.. హైకోర్టు తీర్పు తర్వాతే అభ్యర్థులను ప్రకటించేందుకు నిర్ణయించుకున్నారు. నోటిఫికేషన్ వెలువడిన రెండున్నర గంటల్లోనే హైకోర్టు ఎన్నికలకు బ్రేక్ వేసే విధంగా స్టే ఇవ్వడం కలకలం రేపింది. నోటిఫికేషన్‌ను రద్దు చేసిన కారణంగా ఇప్పటివరకు వేసిన నామినేషన్లు కూడా చెల్లుబాటు కావని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఊరించి, ఉసూరుమనిపించి..
మొత్తంగా 12 నామినేషన్‌లు..

రిజర్వేషన్‌ల ప్రకటన, ఎన్నికల నోటిఫికేషన్‌లు ఆశావహులను ఊరించాయి. కొత్తగా ప్రకటించిన రిజర్వేషన్‌లలో అవకాశం వచ్చిన వారు మురిసిపోయారు. షెడ్యూల్ ప్రకారం తొలి విడతలో ఉమ్మడి వరంగల్‌లో 37 జెడ్పీటీసీలు, 393 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ తర్వాత గురువారం ఉదయం నుంచి నామినేషన్‌ల ప్రక్రియ మొదలైంది. ముహూర్తం ప్రకారం 11వ తేదీలోగా నామినేషన్‌లు వేసేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతా సజావుగా జరిగితే రెండో విడతకు 13వ తేదీ నుంచి 15వరకు నామినేషన్లు వేసేందుకు కూడా సర్వసన్నద్ధమయ్యారు. ఇదిలా ఉంటే మొదటి విడతలో 37 జెడ్పీటీసీ, 393 ఎంపీటీసీ స్థానాలకు గాను జెడ్పీటీసీలకు మూడు, ఎంపీటీసీలకు 9 నామినేషన్‌లు దాఖలయ్యాయి. మహబూబాబాద్, హసన్‌పర్తి, సంగెం జెడ్పీటీసీలకు ఒక్కో నామినేషన్ రాగా, మహబూబాబాద్ జిల్లాలో ఎంపీటీసీలకు ఐదు, వరంగల్ జిల్లాలో రెండు (సంగెం, గీసుకొండ), జేఎస్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం బాగిర్తిపేటలో ఒకటి, హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలో ఒకటి చొప్పున దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

ఇసుక క్వారీ తనిఖీ



బిల్లులను పరిశీలిస్తున్న పీఓ రాజు

మల్హర్: మండలంలోని మల్లారంలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీ కేంద్రాన్ని పెద్దపల్లి టీజీఎండీసీ పీఓ రాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక లోడింగ్, వేబ్రిడ్జి, వేబిల్లులను పరిశీలించారు. క్వారీ టార్గెట్ ఇప్పటి వరకు పంపిన ఇసుక వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేబ్రిడ్జి వద్ద లారీలు ఎక్కువ సమయం ఉండకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. లారీల సీరియల్ ప్రకారమే లోడింగ్ జరిగే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులకు, టీజీఎండీసీ సిబ్బందిదేనని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

రెండో రోజు కొనసాగిన శిబిరం



యోగా చేస్తున్న వలంటీర్లు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామప్పలో గురువారం రెండో రోజు వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణ శిబిరం కొనసాగింది. గురువారం ఉదయం 6గంటలకు యోగా గురువు రాంబాబు వలంటీర్లకు యోగాసనాలు నేర్పించారు. 11 గంటల నుంచి ప్రొఫెసర్ పాండురంగారావు, స్థపతి శివనాగిరెడ్డి కాకతీయ కట్టడాలు, ఆలయాల నిర్మాణాలు, వాటి విశిష్టతలను వలంటీర్లకు తెలిపారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు ఎలా వచ్చిందో వివరించారు. అనంతరం వలంటీర్లు ఆలయాన్ని సందర్శించారు. గైడ్ విజయ్‌కుమార్ రామప్ప విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఏటూరునాగారం/ములుగురూరల్: పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ములుగు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ శబరీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో ముళ్లకట్టకు చెందిన మంతెన రామయ్యపై అడ్డూరి ఉదయ ఫిర్యాదు మేరకు 2023లో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. గురువారం తుది విచారణ చేసిన జిల్లా పోక్సో కోర్టు.. నిందితుడు మంతెన రామయ్యపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 12వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఎస్పీ తెలిపారు. అప్పటి ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఎస్సై ఇంద్రయ్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారన్నారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన ఏఎస్పీ సంకీర్త్, ప్రస్తుత ఏఎస్పీ శివం ఉపాధ్యాయను ఎస్పీ అభినందించారు. బాధితురాలికి రూ.10లక్షల పరిహారం కూడా ఇప్పించేందుకు కోర్టు చర్యలు తీసుకుంటుందన్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తిపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్క

తరిగొప్పుల: కూరగాయలతోపాటు గంజాయి పెంచుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన సాకేత్ కమలేశ్ తన ఇంటి ఆవరణలో కూరగాయలతోపాటు గంజాయి పెంచుతున్నాడనే సమాచారం మేరకు గురువారం తనిఖీ చేశామన్నారు. ఇందులో 30 అంగుళాల పొడవైన గంజాయి మొక్కను గుర్తించామన్నారు. ఆ మొక్క సుమారు 6.5 కేజీల ఉంటుందన్నారు. కమలేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, సాకేత్ కమలేశ్ పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే పోటీలు

విద్యారణ్యపురి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ డ్రామా పోటీలు దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖలోని క్వాలిటీ కో–ఆర్డినేటర్ బండారు మన్మోహన్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు ముగిశాయి. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈపోటీల్లో 'హైజీన్ ఫర్ ఆల్ అందరి కోసం పరిశుభ్రత' అంశంపై శ్యాయంపేట తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన డ్రామా రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి తెలిపారు. లయన్స్ క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు టి.రమేశ్‌బాబు, బాధ్యులు ప్రభాకర్ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ రంగస్థల, సినీ నటుడు బిటరవం శ్రీధరస్వామి, హిందీ స్కూల్ అసిస్టెంట్ చెడుపాక రాములు వ్యవహరించారు. ఈపోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఈవీ.. ఈజీ డ్రైవ్!

ఆర్టీఏలో ఉచిత రిజిస్ట్రేషన్‌కు అవకాశం



హైదరాబాద్ హైవేపై ఏర్పాటు చేసిన ఈవీ వాహనం చార్జింగ్ యంత్రం



పలురకాల ఎలక్ట్రిక్ వాహనాలు

- పెట్రోల్ బంక్, హోటల్‌లలో ఫాస్ట్ చార్జింగ్ మిషన్లు
- సద్వినియోగం చేసుకుంటే పర్యావరణానికి మేలు

ఖిలా వరంగల్ : కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అలాగే, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతతోపాటు పెరిగిన పెట్రోల్ ధరలతో ప్రజలు కూడా ఈవీ వాహనాల వైపు చూస్తున్నారు. ఫలితంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఈ వాహన కొనుగోళ్లు అంతకంతకూ పెరుగుతున్నాయి. 2019–2020 వరకు ఉమ్మడి జిల్లాలో 800లోపు ఉండగా.. ఇప్పటికే ఈఏడాది సెప్టెంబర్ వరకు 11వేల దాటింది. విద్యుత్ కార్లు సంఖ్య ఉమ్మడి జిల్లాలో 800 వరకు పెరిగాయని మార్కెటింగ్ నిపుణులు చెబుతున్నారు. కాగా, కొనుగోలుదారుల నంచి చార్జింగ్ స్టేషన్లలో ధరలు ఎక్కువ ఉండడం భారమవుతోందనే మాట వినిపిస్తోంది.

జీఎస్టీ తగ్గింపుతో పెరుగుతున్న విక్రయాలు..

జీఎస్టీ తగ్గింపుతోపాటు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీతో విద్యుత్ వాహనాల విక్రయాలు పెరుగుతున్నాయి. రూ.లక్ష విలువైన ద్విచక్రవాహనం కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్, ఇతర చార్జీలకు కనీసం రూ. 8వేల వరకు ఖర్చు అవుతుంది. అదే ఎలక్ట్రిక్ వెహికల్ కొనుగోలు చేస్తే చార్జీల భారం తగ్గనుంది. ద్విచక్రవాహనానికి రోజుకు కనీసం 5 గంటల చార్జింగ్ పెడితే 3 యూనిట్ల కరెంట్ ఖర్చు కానుంది. ఈ లెక్కన యూనిట్‌కు రూ.6 చొప్పున రూ.18 ఖర్చు అయితే వంద కిలోమీటర్లు దూరం ప్రయాణించొచ్చు. పెట్రోల్ వాహనమైతే రూ.180 ఖర్చు అవుతుంది. దీంతో ప్రతి ఒక్కరూ ఈవీ వైపుకు మళ్లుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో ఉండడంతో ఈవీ వినియోగం భాగా పెరిగిపోతోంది.

అని రకాల వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్ వర్తింపు..

గతంలో వంద సీసీ కన్నా తక్కువ సామర్థ్యమున్న ద్విచక్రవాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్ సదుపాయం ఉండేది. నూతన పాలసీతో అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు ఆర్టీఏలో ఉచిత రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, గూడ్స్, బస్సులు అన్నింటి రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ రుసుం ఉచితం. గతంలో వాహనదారుడు రెండో వాహనం కొనుగోలు చేస్తే 2 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు ఈవీ రెండో వాహనమైతే పన్ను ఉండకపోవడం చాలా మందికి ఊరటం కలిగించే అంశం. ఉచిత రిజిస్ట్రేషన్ విధానం 31 డిసెంబర్ 2026 వరకు అమలులో ఉండనుంది.

విద్యుత్ సంస్థలతోనూ ఒప్పందాలు..

గతంలో పెట్రోల్ బంకుల్లో మాత్రమే చార్జింగ్ స్టేషన్లు ఉండేవి. ఇప్పుడు ప్రధాన జాతీయ రహదారుల పక్కన పెట్రోల్ బంకులు, హోటళ్ల ప్రాంగణంలో ఈవీ వాహనాల చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల పబ్లిక్, ప్రైవేట్ కలిసి 25లోపు ఉన్నాయి. కాగా, ఫాస్ట్ చార్జింగ్ కేంద్రాలు వాహన షోరూమ్‌ల్లో మాత్రమే ఉన్నాయి. విక్రయాల అభివృద్ధికి అనుగుణంగా ఇప్పడిప్పుడే చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని, కార్ల కంపెనీలతోపాటు ప్రైవేట్ సంస్థలు ఆ మేరకు ముందుకొచ్చి విద్యుత్ సంస్థలతోనూ ఒప్పందాలు చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఉమ్మడి జిల్లాలో ఈవీల జోరు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11వేలకు పైగా ఈవీ వాహనాలు ఉన్నాయి. ఇందులో వరంగల్ జిల్లాలో ప్రస్తుతం బైక్‌లు 2,728, కార్లు 128, ఆటోలు 93, త్రీవీలర్ గూడ్స్ 56, లైట్‌గూడ్స్ 24, క్లాబ్ 1.. మొత్తం 3,030 వాహనాలు ఉన్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈవీ ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కాయి. వాటి సేవలను ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఈ వాహనాల సంఖ్య పెరగడంతో జిల్లాలో ఈవీ చార్జింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ఇంధన వనరుల పురుత్పాదక సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై నెలకొల్పేందుకు స్థల సేకరణలో నిమగ్నమయ్యారు.

ఈవీతో ప్రయోజనాలు..



పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో దోహదపడుతాయి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈవీ వాహనానికి ఆర్టీఓ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ఉచితం. వాహనదారులు ప్రభుత్వం కల్పించే రాయితీ సదుపాయాన్ని వినియోగించుకోవాలి.

శోభన్‌బాబు ఇన్‌చార్జ్ ఆర్టీఓ, వరంగల్

ఈవీ బైక్ తీసుకున్నా..



గతంలో ఈవీ బైక్ ధర అన్ని రకాల చెల్లింపులు కలిపి రూ. లక్ష దాటేది. ఇప్పుడు జీఎస్టీ తగ్గించడంతో కొంత మేర ఆర్థిక భారం తగ్గింది. మోడల్‌ను బట్టి రూ.6 వేల నుంచి రూ. 15వేల వరకు ధరలు తగ్గాయి. జీఎస్టీతో వాహనం ధర తగ్గింది. ఈవీ బైక్ తీసుకున్నా. మెయింటెనెన్స్ ఖర్చులు లేకపోవడంతో హ్యాపీగా జర్నీ చేస్తున్నా.

కె. నవీన్‌రెడ్డి, రంగశాయిపేట వరంగల్

ప్రాణదాత.. యుగంధర్

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు
- యశోదలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- అంతటి బాధలోనూ ఆరుగురికి అవయవ దానం చేసిన తల్లిదండ్రులు



యుగంధర్ (ఫైల్)



మృతదేహం వద్ద గౌరవవందనం చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

రఘునాథపల్లి : ఓ యువకుడు తాను చనిపోతూ ఆరుగురికి ప్రాణం పోశాడు. తన అవయవాలు దానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు. మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించి అందరితో జేజేలు అందుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండలగూడెం గ్రామానికి చెందిన గాదె మురళీధర్, శోభ దంపతుల కుమారుడు యుగంధర్ (28) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో దసరా పండుగకు స్వగ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఈ నెల 5న బైక్‌పై మేనత్త కుమారుడు చందుతో కలిసి హైదరాబాద్ వెళ్తుండగా ఉప్పల్ దాటాక అదుపు తప్పి కిందపడింది. దీంతో యుగంధర్ తలకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న యుగంధర్ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గురువారం ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కాగా, పుట్టెడు దుఃఖంలోనూ వారు మానవత్వం మరువలేదు. కొడుకు బ్రెయిన్ డెడ్ కావడంతో తన అవయవ దానానికి అంగీకరించారు. దీంతో వైద్యులు వెంటనే యుగంధర్ గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, కళ్లు సేకరించారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరుగురు రోగులకు అమర్చారు. ఫలితంగా యుగంధర్ తాను మరణించి ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపగా.. తల్లిదండ్రుల నిర్ణయాన్ని అందరూ అభినందించారు. తమ తనయుడు ఆరుగురికి ఊపిరి పోశాడని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, యుగంధర్ మృతదేహానికి ఆస్పత్రి సిబ్బంది గౌరవ వందనం చేసి అంబులెన్స్‌లో స్వగ్రామానికి పంపారు. యుగంధర్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

డిప్లొమా విద్యార్థులకు కాంటాక్ట్ తరగతులు

- దూరవిద్యకేంద్రం డైరెక్టర్ సురేశ్‌లాల్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ)లోని డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కోర్సులో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు(2024–2025) మొదటి దశ కాంటాక్ట్ తరగతులు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దూర విద్య కేంద్రం డైరెక్టర్ బి. సురేశ్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్యకేంద్రంలోనే థియరీ అండ్ ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించనున్నామని, తప్పనిసరిగా ఆయా విద్యార్థులు హాజరు కావాలన్నారు.

సెల్ట్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్..

కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులపాటు స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోర్సు ఈనెల15వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ సెల్ట్ డైరెక్టర్ మేఘనారావు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు కోర్సు నమోదుకు రూ. 200 , బోధన, బోధనేతర ఉద్యోగులు, గృహిణులు, ఇతర ఆసక్తి ఉన్న వారికి రూ. 1,500 ఫీజు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, నాన్ యూనివర్సిటీ ఫండ్‌లో ఈనెల13వ తేదీ వరకు చెల్లించాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఈ కోర్సులో చేరిన వారికి 40రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

12న మిడ్కో సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ సభ



రేణుక (ఫైల్)

హన్మకొండ కల్చరల్: దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యమకారిణి, రచయిత గుముడవెల్లి రేణుక (మిడ్కో) సమగ్ర సాహిత్యం పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు అస్నాల శ్రీనివాస్, బిల్ల మహేందర్, బోనగిరి రాములు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న (ఆదివారం) ఉదయం 10గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో జరుగనున్న సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తారని, ఉమ్మడి వరంగల్ జిల్లా సాహితీవేత్తలు, ప్రజాస్వామికవాదులు, పరిశోధక విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో న్యాయశాస్త్రం పూర్తిచేసిన కడవెండికి చెందిన గుముడవెల్లి రేణుక మూడు దశాబ్దాల పాటు ప్రజాఉద్యమాలలో పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేశారు. తాను పాల్గొన్న, తనకు ప్రేరణనిచ్చిన ఉద్యమాలను పరిశీలించి మిడ్కో, దమయంతి వంటి కలం పేర్లతో కథలు, వ్యాసాలు రాసి 2025 మార్చి 31న చనిపోయారు. ఈ మేరకు అనురాధ సంపాదకత్వంలో, విరసం ప్రచురణలో వెలువరించిన మెట్టమీద, ప్రవాహం, విముక్తిబాటలో అనే మూడు సంపుటాలను ఆదివారం ఆవిష్కరించనున్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు భవనాల పరిశీలన



'కుడా' కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కావ్య, సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణి

నయీంనగర్/కాజీపేట: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) వెల్‌నెస్ సెంటర్ వరంగల్‌లో ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సెంటర్ ఏర్పాటుకు గురువారం 'కుడా' కార్యాలయంలో పైఅంతస్తు, కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ఖాళీ భవనాలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిణి పరిశీలించారు. వీటితోపాటు దూరదర్శన్ కార్యాలయం వసతి గృహాన్ని పరిశీలించి భవన స్థితిగతులు, విస్తీర్ణం వంటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ భవనం ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తిచేసి సెంటర్ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పీఓ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిగువ కేడర్ ఉద్యోగులకు సబ్‌ఇంజనీర్‌గా అవకాశం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో అర్హత కలిగిన దిగువ కేడర్ ఉద్యోగులను సబ్ ఇంజనీర్‌గా నియమించేందుకు యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన యాజమాన్యం.. స్క్రీనింగ్ టెస్ట్‌కు అవసరమైన వివరాలు, సంబంధిత సర్టిఫికెట్లు పంపాలని సర్కిల్ సూపరింటెండ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. 34 మందికి సబ్ ఇంజనీర్‌గా కన్వర్షన్ అవకాశం దక్కనుంది. ఈ మేరకు దిగువ క్యాడర్ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి సంబంధించిన పూర్తి సమాచారం పంపాలని సర్కిళ్లకు ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ చీఫ్ ఇంజనీర్ మాధవరావు గురువారం మెమో జారీ చేశారు. హనుమకొండ సర్కిల్‌లో ఆరుగురు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ సర్కిల్‌లో ఒక్కరు చొప్పున, కరీంనగర్, పెద్దపల్లిలో ఇద్దరి చొప్పున, ఖమ్మం సర్కిల్‌లో 8, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్‌లో 3 చొప్పున, మంచిర్యాలలో నలుగురు సబ్ ఇంజనీర్ కోసం అర్హులుగా గుర్తించారు.

37.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.1,01,250 విలువైన 37.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని టీవీఎస్ ఎక్సెల్, ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్, ప్యాకింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వరంగల్ గొర్రెకుంట గరీబ్‌నగర్ ప్రాంతంలో వరంగల్ జిల్లా నెక్కొండ తండాకు చెందిన గుగులోత్ వెంకన్న, గొర్రెకుంట గరీబ్‌నగర్‌కు చెందిన గోవిందుల రవి, నెక్కొండ అమీనాబాద్‌కు చెందిన పాల్తీయా వెంకటేష్ సమిష్టిగా నగర శివారు, గీసుగొండ మండల కేంద్రంలో ప్రజల వద్ద కొనుగోలు చేసిన రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం అందింది. దీంతో ఏసీపీ ఆదేశాల మేరకు గురువారం గరీబ్‌నగర్‌లో ఓ ఇంటిపై దాడి చేసి నిల్వ చేసిన 37.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



రుషికేశ్ మృతదేహం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో స్నేహితుడి ఇంటికి వచ్చిన ఓ యువకుడు గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుమలగిరి శ్రీనివాస్ కుమారుడు రుషికేశ్ (22) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా కాజీపేటలో ఉంటున్న స్నేహితుడు కొండా హర్షిత్ ఇంటి వద్ద ఉంటున్నాడు. కాగా, రుషికేశ్ మంచంపై నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత హర్షిత్ చూడగా కిందపడి కనిపించడంతో కుటుంబీకులను అప్రమత్తం చేసి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ జరిపారు. రుషికేశ్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

నా నిశ్శబ్దమే సమాధానం

- పార్టీ మారుతానని ప్రచారం చేసేవాళ్లకు అదే చెంపదెబ్బ
- అత్యంత తొందరగా ప్రజాదరణ కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

జనగామ: పొన్నాల పార్టీ మారుతాడని ప్రచారం చేస్తున్న కొంతమంది మూర్ఖులకు తన నిశ్శబ్దమే చెంపదెప్ప లాంటిదని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఘాటుగా విమర్శించారు. రాజకీయాల్లో తాను ఎప్పుడూ టైగరేనని, అవసరమైనప్పుడే గర్జిస్తానని, ప్రజల పక్షాన నిలబడతానని చెప్పుకొచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్న కేసీఆర్‌తో కలిసి ముందుకెళ్లేందుకే బీఆర్‌ఎస్‌లోకి వచ్చానన్నారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రజాదరణ కోల్పోయిన పార్టీగా కాంగ్రెస్ చరిత్ర పుటల్లో నిలుస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఓటమి తాత్కాలికమేనని, కోట్లాది మంది ప్రజల అభిమానం ఉన్న కేసీఆర్‌కు అంతకు రెట్టింపు ఆదరణ రానుందన్నారు. లక్షలకు పైగా మైనారిటీ ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్‌లో గెలవలేని కాంగ్రెస్, ఉపఎన్నికల్లో విజయం తమదే అనడం సిగ్గుచేటన్నారు. నూటికి నూరు శాతం అక్కడ బీఆర్‌ఎస్ మరోసారి జెండా ఎగురవేయబోతోందన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరి గౌడ్, సీనియర్ నాయకులు పసుల ఏబేలు, ధర్మపురి శ్రీనివాస్, ఎండీ మాజిద్, ఉల్లెంగుల సందీప్, కొమ్ము రాజు, ఎండీ యాకూబ్, ఉడుగుల కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

పర్వతగిరి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కల్లెడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్(42) ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఏటా దిగుబడి తగ్గి ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. పంట పెట్టుబడి, కుటుంబ అవసరాలకు సుమారు రూ. 10 లక్షల వరకు అప్పు అయ్యింది. దీంతో అప్పు ఎలా తీర్చాలని కొంత కాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ఏటీఎం కార్డు తస్కరించి రూ.19వేలు డ్రా

కాజీపేట: ఆదరిస్తున్న కుటుంబాన్నే ఓ యువకుడు వంచించాడు. ఏటీఎం కార్డు తస్కరించి రూ.19వేలు డ్రా చేశాడు. బాధితుల కథనం ప్రకారం.. కాజీపేటకు చెందిన బైరి సునీత కుటుంబ సభ్యులు తమకు పరిచయం ఉండి ఉపాధిలేక తిరుగుతున్న కడిపికొండకు చెందిన యువకుడు శివను చేరదీసి చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం స్కూటీ డిక్కీలో ఉన్న ఏటీఎం కార్డును తస్కరించి రూ.19వేలు డ్రాచేశాడు. బాధితుల సెల్‌కు డబ్బులు డ్రా అయ్యినట్లు మెస్సేజ్ రావడంతో ఖంగుతిన్నారు. బైక్ డిక్కీలో చూడగా ఏటీఎం కార్డు కనిపించకపోవడంతో శివ డ్రా చేసి ఉంటాడని భావించారు. అనంతరం ఫోన్ చేయగా తనను దుండగులు కిడ్నాప్ చేశారంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో సునీత కుటుంబీకులు బ్యాంకులో ఫిర్యాదు చేసి ఖాతా లావాదేవీలను నిలిపివేయించారు. కాగా, శివపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సునీత విలేకరులకు తెలిపారు.

'ఓరుగల్లు నుంచి బస్తర్ వరకు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణ్‌సింగ్

హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన చరిత్రకారులు అరవింద్ ఆర్య పకిడే, కట్టా శ్రీనివాస్ రచించిన 'ఓరుగల్లు నుంచి బస్తర్ వరకు 'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్పూర్ రాజమహల్‌లో బస్తర్ రాజు మహారాజా కమల్ చంద్ర భంజ్ దేవ్, రాజమాత ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ రమణ్‌సింగ్ పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమణ్‌సింగ్ మాట్లాడుతూ ఈ పుస్తకం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మధ్య ఉన్న ప్రాచీన సంబంధాలను తెలియజేస్తుందని, విలువైన చారిత్రక గ్రంథాన్ని వెలువరించిన అరవింద్, శ్రీనివాస్ కృషి అభినందనీయమన్నారు. మహారాజా కమల్ చంద్ర భంజ్‌దేవ్ మాట్లాడుతూ వరంగల్ నుంచి బస్తర్ వరకు ఉన్న చారిత్రక కట్టడాలు, వారసత్వ విశేషాల గురించి పుస్తకం తెలుపుతుందని, భవిష్యత్ తరాలకు వారధిగా నిలుస్తుందన్నారు. చరిత్రకారుడు అరవింద్ ఆర్య మాట్లాడుతూ ఈ పుస్తకంలో కాకతీయ వంశంపై పరిశోధనాత్మక విశ్లేషణలు ఉన్నాయని, ఓరుగల్లు నుంచి బస్తర్ వరకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను ఆధారాలతో వివరించామన్నారు.

మద్యం మత్తులో వీరంగం

- ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ముగ్గురు యువకుల దాడి
- చంపుతామని ప్రయాణికులకు బెదిరింపులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

గీసుకొండ: మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. ఒకే బైక్‌పై ట్రిపుల్ డ్రైవ్ చేస్తూ ఆర్టీసీ బస్సును అడ్డగించి డ్రైవర్‌ను కిందకు లాగి చితకబాదారు. అంతేకాకుండా ప్రయాణికులను చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ నగరంలోని కరీమాబాద్‌కు చెందిన యువకులు అజ్మత్, కరీముల్లా, ఉబేద్ మద్యం మత్తులో ఒకే బైక్‌పై ట్రిపుల్ డ్రైవ్ చేస్తూ వరంగల్–నర్సంపేట రహదారిలో జాన్‌పాకమన్నా చర్చ్ వద్ద ఆర్టీసీ బస్సును అడ్డగించారు. అనంతరం డ్రైవర్‌ను కిందికి లాగి చితకబాదారు. వారిని ఆపడానికి ప్రయత్నించిన ప్రయాణికులను చంపుతామని బెదిరించారు. బాధితులు రాత్రి 100కు డయల్ చేయగా స్పందించిన పోలీసులు అరవింద్, రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. బస్సు డ్రైవర్ శంకర్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసు అధికారులకు వృద్ధురాలి విజ్ఞప్తి



గాయపడిన వృద్ధురాలు అరుంధతి

వరంగల్: కుటుంబ గొడవలను మనసులో పెట్టుకుని తనపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కోడలు పెరుమాండ్ల విద్యారాణి, ఆమె తల్లి పోరండ్ల నిర్మల, తమ్ముళ్లు వేణు, తరుణ్‌పై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన వృద్ధురాలు పెరుమాండ్ల అరుంధతి(70) పోలీసులను కోరారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు నరేశ్, విద్యారాణికి 14ఏళ్ల క్రితం పెళ్లి అయ్యిందని, హైదరాబాద్‌లో ఉంటున్న వీరి మధ్య ఏడాది క్రితం గొడవలు జరగడంతో ఆమె తన తల్లి గారింటికి వెళ్లిందన్నారు. మనస్పర్థలు రావడంతో ఇద్దరు వేరుగా ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో ఈనెల 6న తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో తన కోడలు, ఆమె తల్లి, తమ్ముళ్ల దాడికి పాల్పడ్డగా తీవ్రంగా గాయపడ్డానన్నారు. అనంతరం తన సెల్ ఫోన్, లాప్‌టాప్, భూపత్రాలను తమ వెంట తీసుకెళ్లారన్నారు. ఈదాడిపై తాను ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని, దీనిపై పోలీసు అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
శుక్రవారం ॥ 10-10-2025



కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్పుకుందాం

ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పదమూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.



సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్



అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్



అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య



అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో!

24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లల్లో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.





ఫ్యాషన్

• ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు

రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు
లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు
మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న
ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్
సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం
నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా
నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో
తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా
ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్,
ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.















సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు-జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.


■ సెలబ్రిటీల స్టైల్ టచ్

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వీకపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.

కేర్‌గివర్

రాణి అనే నేను
ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...



ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80-డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.



మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడుపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్ తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.



వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	బంగారం (24 క్యారెట్లు)	1,26,250	బంగారం (24 క్యారెట్లు)	1,24,150	బంగారం (24 క్యారెట్లు)	1,26,250.	బంగారం (24 క్యారెట్లు)	1,28,000	బంగారం (24 క్యారెట్లు)	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	బంగారం (22 క్యారెట్లు)	1,13,380	బంగారం (22 క్యారెట్లు)	1,13,800	బంగారం (22 క్యారెట్లు)	1,17,210	బంగారం (22 క్యారెట్లు)	1,17,700	బంగారం (22 క్యారెట్లు)	1,14,000
వెండి	1,70,000	వెండి	1,58,600	వెండి	1,67,000	వెండి	1,58,600	వెండి	1,60,000	వెండి	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.